సమస్యల పరిష్కారానికి చర్యలు

నిజాంపేట్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. శనివారం ఎన్టీఆర్ నగర్ సంక్షేమ సంఘం నాయకులు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొలను శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరిగిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెడ్డిపల్లి సుధాకర్, సభ్యులు లక్ష్మి, కాలప్ప, ఉదయ్‌కుమార్, మోహన్, కాలిమా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హరిహర క్షేత్ర మొదటి వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 10వ వార్డులోని హరిహర క్షేత్ర దేవాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రజలు వేడుకల్లో పాల్గొని లక్ష్మీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ తదితరులు పూజలు నిర్వహించారు.

మంటలంటుకొని ఇద్దరు బాలికలకు తీవ్ర గాయాలు

కుత్బుల్లాపూర్ : ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని ఇద్దరు బాలికలకు గాయాలయ్యాయి. ఈ ఘటన పేట్‌బషీదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్, జయరాం నగర్ కు చెందిన జంగ్ బహదూర్ కూతుర్లు గుల్సన్ (11), అఫ్సన్ (13)తో పాటు మరో బాలుడు సాహిద్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో అదే బస్తీలో చెత్త ఉన్న దగ్గర మంటలు వేశారు. పక్కనే ఉన్న ప్లాస్టిక్ బాటిల్‌ను అందులో పెట్రోల్ ఉందని చూసుకోకుండా ఆ మంటలో వేశారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గుల్సన్, అఫ్సన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ బాలికల ఇద్దరిని సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్, కోడి గుడ్ల వినియోగంపై అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: పౌల్ట్రీ బ్రీడర్స్ కో ఆర్డినేషన్ అసోసియేషన్, జాతీయ కోడిగుడ్ల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓల్డ్ అల్వాల్, బోయిన్ పల్లి, నాంపల్లి, అత్తాపూర్, సరూర్ నగర్, హయత్‌నగర్, మన్సూరాబాద్, మొయినాబాద్ ప్రాంతాల్లో 'చికెన్–కోడిగుడ్ల మేళా' నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్ పై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగిస్తూ చికెన్ వంటకాలు, ఉడికించిన కోడి గుడ్లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 70 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద బర్డ్ ఫ్లూ వైరస్ చనిపోతుందని వెల్లడించారు. అలాంటిది మన భారతదేశంలో 100 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ వేడిలోనే వండుతారని, దీనివల్ల ఏ ప్రమాదం ఉండదని అవగాహన కల్పించారు.

షెడ్డును తొలగించారు.. వ్యర్థాలను మరిచారు

- పార్కు మధ్యలోనే షెడ్డు, స్టేజీ నిర్మాణ వ్యర్థాలు
- కూల్చివేయడంలో చూపిన శ్రద్ధ తొలగించడంలో చూపడం లేదని అధికారులపై స్థానికుల ఆగ్రహం



పార్కు మధ్యలో ఉన్న నిర్మాణ వ్యర్థాలు

నిజాంపేట్: మున్సిపల్ పరిధిలోని ప్రగతినగర్ వాసవీ లేవుట్ పార్కులోని నిర్మాణ వ్యర్థాలను తొలగించడం లేదు. దీంతో అధికారుల తీరుపై స్థానికులు, వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లేవుట్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులో వినాయక మండపం కోసం వినాయక చవితి సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో షెడ్డును నిర్మించారు. అనంతరం తొలగించకపోవడంతో వినాయక చవితి అనంతరం పార్కులోని షెడ్డును అధికారులు కూల్చి వేశారు. ఇటీవల షెడ్డుకు సంబంధించిన పరికరాలను అసోషియేషన్ ఆధ్వర్యంలో తొలగించారు. అక్కడ నిర్మించిన స్టేజీని సైతం అధికారులు కూల్చి వేశారు. కానీ ఇప్పటి వరకు ఆ నిర్మాణ వ్యర్థాలను మాత్రం తొలగించ లేదు. షెడ్డును, స్టేజీని కూల్చడంలో చూపించిన శ్రద్ధ.. వ్యర్థాలను తొలగిండంలో ఎందుకు చూపడం లేదని అధికారులను స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి రోజు పార్కులో చిన్న పిల్లలు ఆడుకునేందుకు నిర్మాణ వ్యర్థాలు అడ్డుగా ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాకర్స్‌కు సైతం వ్యర్థాలు ఇబ్బందిగానే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని వేడుకుంటున్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులేవీ?



మంచిగా ఉన్న రోడ్డులో తారువేసి..



సమీప గుంతలను వదిలేసి

జీడిమెట్ల: మంచిగా ఉన్న రోడ్లలో తారు రోడ్లు వేస్తూ గుంతలు ఉన్న రోడ్లను టీఎస్ఐఐసీ అధికారులు విస్మరిస్తున్నారు. ఇటీవల రెండు రోజులుగా జీడిమెట్ల పారిశ్రామికప్రాంతంలో టీఎస్ఐఐసీ అధికారులు రాత్రి పూట పలుచోట్ల తారు రోడ్లను వేయిస్తున్నారు. రోడ్డు మంచిగా ఉన్న చోట రోడ్లను ఏర్పాటు చేసి గుంతలుగా ఉన్న చోట్ల వదిలేస్తుండటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేవలం కమీషన్‌ల కోసమే అధికారులు రోడ్లు వేయిస్తున్నట్లుగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. జీడిమెట్ల నుంచి దూలపల్లి వేళ్లే రోడ్డు అపురూప జంక్షన్, జీడిమెట్ల నుంచి రాంరెడ్డినగర్ వెళ్లే చోట ఇప్పటికే రోడ్డు గుంతలుగా ఉంది. ఈ విషయం తెలిసినప్పటికీ అధికారులు అక్కడ రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీడిమెట్ల ఫేజ్ 5 రోడ్డులో అధికారులు నాలా నిర్మించేందుకు సంవత్సరం క్రితం జేసీబీతో రోడ్డును తవ్వారు. అక్కడ నాలా నిర్మించకపోగా గుంతలను అలాగే వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు ఉన్న చోట్ల రోడ్లకు మరమ్మతులు చేయాలని, తారు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయంలో అన్నదానం

జగద్గిరిగుట్ట: చింతల్‌లో శ్రీసాయి కాలనీ అభయ ఆంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మన్ కన్నేకంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కళ్యాణ్ రావు పాటిల్ ఆధ్వర్యంలో అన్నదానం కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు



జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

దుండిగల్: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో శనివారం ప్లాస్టిక్ బ్యాన్ కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రత్యేకం టీమ్‌లను ఏర్పాటు చేసి ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడుతున్న దుకాణ, చికెన్, మటన్ షాపులు, హోటళ్లపై రైడ్ చేసి రూ.12,700 జరిమానా విధించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ బ్యాగులు, చేతి సంచులు, టిఫిన్ బాక్స్‌లను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.అంజయ్య, రాంచందర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సాత్విక్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఎన్‌ఆర్‌లో ముగిసిన సాంకేతికోత్సవం



నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో 'కన్వర్జెన్స్ 2కె25' సాంకేతికోత్సవం శనివారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీసీఎస్ ప్రధాన కన్సల్టెంట్, డిజిటల్ ఉపక్రమణాల సాంకేతికత అధిపతి పెద్దిగారి బాలప్రసాద్ హాజరై మాట్లాడారు. సాంకేతికత అభివృద్ధి వేగంగా అభివృద్ధి చెందుతుందని, దానికి అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. హ్యాకథాన్, క్యాడథాన్, కోడింగ్ కాంటెస్ట్, ప్రాజెక్టు కాంటెస్ట్, క్యాంపస్ ఆటోమేషన్, సరదా పోటీల్లో నగరంలోని వివిధ కాలేజీలతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సీడీ నాయుడు, డీన్ పద్మాశాయి, డా.బి.చెన్న కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్ గ్లోబెల్ స్కూల్‌లో ఫుడ్ ఫెస్ట్



వంటకాలను పరిశీలిస్తున్న పున్నారెడ్డి

సుభాష్‌నగర్: గాజులరామారం చిత్తారమ్మదేవి నగర్‌లోని ఎస్పీఆర్ గ్లోబెల్ స్కూల్‌లో శనివారం ఫుడ్‌ఫెస్ట్‌ను నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వంటకాలను ఈ ఫెస్ట్‌లో అందుబాటులో ఉంచారు. ముఖ్య అతిథిగా పాఠశాల చైర్మన్ సాంటిరెడ్డి పున్నారెడ్డి హాజరై ఫుడ్‌ఫెస్ట్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ ఫెస్ట్‌లో వంటకాలు విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని తమ పాఠశాలకు చెందిన చిల్డ్రన్ వెల్ఫేర్ ఫండ్‌కు జమ చేస్తామన్నారు. సదరు ఫండ్‌తో ఆర్థికంగా అవసరమైన చిన్నారులకు చేయూతనందిస్తామని తెలిపారు. ఫెస్ట్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో అగ్రగామి భారతి సిమెంట్



బాచుపల్లిలో మేస్త్రీలతో శివకుమార్

నిజాంపేట్: నిర్మాణ రంగంలో భారతి సిమెంట్ నాణ్యతలో అగ్రగామిగా కొనసాగుతుందని, అల్ట్రా ఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదలైందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి బాచుపల్లిలోని వినాయక స్టీల్ ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని వివరించారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. కార్యక్రమంలో డీలర్ గోపాల్‌రెడ్డి, మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ రాజేంద్రప్రసాద్, మేస్త్రీలు పాల్గొన్నారు.

గ్యాస్ పైపులైన్ లీకేజీతో అలజడి

- చెట్టు మొదలును జేసీబీతో తొలగిస్తుండగా ఘటన
- వెంటనే చేరుకొని మరమ్మతులు చేసిన యంత్రాంగం
- ఊపిరి పీల్చుకున్న ప్రజలు



గ్యాస్ లీకేజీ ప్రాంతం

సుభాష్‌నగర్: చెట్టు మొదలును జేసీబీతో తొలగిస్తుండగా గ్యాస్ పైపులైన్‌కు తగిలి లీకేజీ ఏర్పడిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం ప్రధాన రోడ్డులోని నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఓ హోటల్ యజమాని తన దుకాణానికి ఎదురుగా ఉన్న చెట్టు మొదలును శనివారం ఉదయం జేసీబీతో తొలగిస్తున్నాడు. అదే చోట భూగర్భ మార్గంలో ఉన్న గ్యాస్ పైప్‌లైన్‌కు తగిలింది. దీంతో పెద్ద ఎత్తున గ్యాస్ లీకేజీ అయ్యింది. గ్యాస్ చుట్టు పక్కల మొత్తం వ్యాపించడంతో అక్కడి నుంచి జేసీబీ డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని జీడిమెట్ల ఫైర్ సేఫ్టీ అధికారులకు, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ అధికారులకు సమాచారం అందించారు. భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని పైపులైన్‌కు మరమ్మతులు చేయడంతో స్థానికంగా ఊపిరి పీల్చుకున్నారు.

రైతులకు అన్యాయం జరిగితే సహించబోం

- బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి
- రైతులకు అఖిలపక్షం మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.మల్లారెడ్డి

దుండిగల్: రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని, న్యాయం జరిగే వరకు అన్ని రాజకీయ పార్టీలు అండగా నిలవాలని బీజేపీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డి అన్నారు. దుండిగల్‌లోని వార్డు కార్యాలయంలో శనివారం రైతులు సమావేశం నిర్వహించారు. పార్టీలకతీతంగా నాయకులు మద్దతు తెలిపారు. దుండిగల్ గ్రామంలోని సర్వే నంబరు 453, 454 లలో దాదాపు 300 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో 220 ఎకరాలకు పైగా రైతు కుటుంబాలు 70 సంత్సరాలుగా కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వం గతంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం 27 ఎకరాలను కేటాయించి నిర్మాణాలను పూర్తి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీఏ కార్యాలయం కోసం మరో 40 ఎకరాల భూమిని కేటాయించింది. దీంతో ఆందోళనకు గురైన రైతులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కావలి గణేశ్, మాజీ కౌన్సిలర్లు జక్కుల కృష్ణా యాదవ్, ఆనంద్, గోపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నేతలు విఘ్నేశ్వర్ చారి, పీసరి కృష్ణారెడ్డి, జక్కుల శ్రీనివాస్ యాదవ్, నల్తూరి కృష్ణ, బండారి మహేశ్, మల్లేష్ యాదవ్, ఆకుల మల్లేష్, విజయ్ సాయి, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో సమస్యల తిష్ట!

- అధిక శాతం అద్దె భవనాల్లోనే నిర్వహణ
- మరోవైపు టీచర్లు, హెల్పర్లకు అందని వేతనాలు
- కూరగాయలు, గ్యాస్ బిల్లులు కూడా రాని వైనం
- పిల్లలు, గర్భిణులకు తప్పని ఇక్కట్లు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. ఓవైపు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు లేక అల్లాడుతుంటే, మరోవైపు అధిక శాతం సెంటర్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇంకోవైపు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలకు నెలనెలా జీతాలు రాకపోవడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికితోడూ కూరగాయలు, గ్యాస్ సిలిండర్ల బిల్లులు కూడా ఏడాదిగా పెండింగ్‌లో ఉండడంతో అప్పులు తెచ్చి కేంద్రాలను నిర్వహించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 212 సెంటర్లకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవిగాకుండా దాతలు ఇచ్చిన మరో 138 భవనాల్లో కొన్ని కొనసాగుతుండగా, మిగిలిన 443 కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 కేంద్రాలు ఉండగా, అత్యధికంగా 277 సెంటర్లు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. అల్వాల్‌లో 271 కేంద్రాలకు 143 కేంద్రాలు, మేడ్చల్‌లో 211 కేంద్రాలకు 23 సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి 6 నెలలుగా అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో యాజమానుల నుంచి ఒత్తిడి భరించలేకపోతున్నామని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

117 కేంద్రాల్లో నీటి కట..కట

జిల్లాలోని 117 కేంద్రాల్లో తాగునీరు తదితర సౌకర్యాలు లేవు. ఇందులో మేడ్చల్ పరిధిలో అత్యధికంగా 77 కేంద్రాలు, అల్వాల్ పరిధిలో 40 కేంద్రాలు ఉన్నాయి.

మరుగుదొడ్లు అంతంతే..

జిల్లాలోని 118 అంగన్‌వాడీ కేంద్రాలోల్ కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. ఇందులో మేడ్చల్ పరిధిలో 78, అల్వాల్ పరిధిలో 51, కుత్బుల్లాపూర్ పరిధిలో 40 కేంద్రాలు ఉన్నాయి.

793 కేంద్రాల్లో 1.07 లక్షల లబ్ధిదారులు

జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో 6 నెలల నుంచి 6 ఏళ్ల పిల్లలు 90,361 మంది, గర్భిణులు, బాలింతలు 17,123 మంది మొత్తం 1,07,484 మంది ఉన్నారు. ఇందులో కుత్బుల్లాపూర్ పరిధిలోని 311 కేంద్రాల్లో 47,028 మంది, మేడ్చల్‌లోని 211 కేంద్రాల్లో 39,463 మంది, అల్వాల్ పరిధిలో 271 కేంద్రాల్లో 20,993 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

- రాత్రి 10 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు..
- మందుబాబులకు కౌన్సెలింగ్
- నంబర్ ప్లేట్ లేని వాహనాలను స్టేషన్‌కు తరలింపు



దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సతీష్ తదితరులు

కుత్బుల్లాపూర్ : సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాలతో అటు మేడ్చల్ ఇటు బాలానగర్ డీసీపీ పరిధిలో ఆయా పోలీస్ స్టేషన్ల వారీగా శుక్రవారం రాత్రి 10 గంటల నుండి అర్ధరాత్రి ఒంటిగంట వరకు టీమ్‌ల వారీగా విడిపోయి విస్తృత తనిఖీలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని జీడిమెట్ల, సూరారం, జగద్గిరిగుట్ట, దుండిగల్, బాచుపల్లి, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్మానుష్య ప్రదేశాలు, బహిరంగంగా రోడ్లపై మద్యం తాగేవారు, గంజాయి బ్యాచ్ కట్టడి చేసే విధంగా తనిఖీలు కొనసాగాయి.

◆ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ సీఐ విజయవర్ధన్ ఆధ్వర్యంలో మొత్తం 2 టీములుగా విడిపోయి సుమారు 33 మందిని అదుపులోకి తీసుకున్నారు. సుచిత్ర చౌరస్తాలో 11 గంటలకు మూసివేయాల్సిన వైన్స్ షాపు తెరిచి ఉండటంతో కేసు నమోదు చేసి అక్కడ ఉన్న వారిని పంపించారు. అదేవిధంగా గంజాయి తాగి రోడ్డుపై తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

◆ దుండిగల్ సీఐ సతీష్ ఆధ్వర్యంలో 2 టీములుగా విడిపోయి మొత్తం 30 మందిని పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. 29 వాహనాలను నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న వాటిని గుర్తించి వాటికి నంబర్ ప్లేట్ వేయించి కేసులు నమోదు చేశారు. గంజాయి తాగి తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

◆ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సీఐ నరసింహ నేతృత్వంలో ఆరు బృందాలుగా విడిపోయి ప్రగతి నగర్ చెరువు, దేవేందర్ నగర్ నిర్మానుష ప్రదేశాలు, గుబురు గుట్ట ప్రాంతాల్లో 28 మంది పట్టుబడ్డారు. చెరువు పక్కనే మద్యం తాగుతున్న వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

◆ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో మొత్తం ఐదు టీములుగా విడిపోయి 30 మందిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. నంబర్ ప్లేట్లు లేని రెండు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

◆ సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో మెట్కానీగూడా, సూరారం ఆక్సిజన్ పార్కు, విశ్వకర్మ ప్రాంతాల్లో నిర్మానుష్య ప్రదేశాలు ఎక్కువగా ఉండడంతో సీఐ భరత్ కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. 15 మంది మద్యం బాబులతో పాటు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిని కట్టడి చేశారు.

◆ బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం ఎనిమిది బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. గంజాయి తాగి రోడ్డు మీద తిరుగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న దుకాణాలను తనిఖీ చేసి 200 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గుట్కా పాన్ మసాలా తింటూ నిర్మానుష్య ప్రదేశాల్లో సంచరిస్తున్న 20 మందిని అదుపులో తీసుకున్నారు. మొత్తం 25 కేసులు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ వెల్లడించారు.

నేడు వాల్మీకి మహర్షి విగ్రహ ఆవిష్కరణ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్, ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ, అంబేడ్కర్‌నగర్ బస్టాప్ ప్రాంతంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరిస్తున్నట్లు వాల్మీకి మహర్షి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బోయి కిషన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేట ర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



కైసర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్: గాజులరామారంలోని ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాల కూల్చివేతల పరంపర కొనసాగుతూనే ఉంది. కైసర్‌నగర్‌లోని సర్వే నంబర్ 342 ప్రభుత్వ స్థలంలో వెలసిన రెండు నిర్మాణాలను శనివారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో కూల్చివేశారు. కూల్చివేతల సమయంలో రెవెన్యూ అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు నిర్మాణాలను నేలమట్టం చేశారు. అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా చర్యలు ఉంటాయన్నారు. ఆదివారం ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.